

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 అక్టోబరు, 2010 సంచిక : 5

(వికృతి నామ సం॥, ఆశ్వయుజ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు
(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

Ph : 08685-326053
9440413455, 9848133565

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి .......... 2
మూడు పడకలు .......... 4
బాలవాణి .......... 7
తన కర్మకు తానే కర్త .......... 9
ఆరోగ్య .......... 11
ధన్యత .......... 12
అద్భుత మంత్రం .......... 14
నమస్కారం ఎందుకు చెయ్యాలి .......... 17
మన వంతు పని .......... 18
జీవన సౌందర్యం .......... 21
ఆదిగురువు-దత్త ప్రభువు .......... 27
మాతృసంస్థ కబుర్లు .......... 29
మంగళాశీస్సులు .......... 32







# మా వాణి



సాయిమిత్రులందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

ఈ మధ్యన ప్రతి గ్రామంలోనూ దుర్గా పూజలకు సామూహికంగా పందిళ్లు వెలుస్తున్నాయి. రాజస్థానీ, బెంగాలీ కళాకారులు ప్రధాన పట్టణాలు, నగరాలు ఆసరాగా చేసుకొని రకరకాల విగ్రహాలు తయారుచేస్తున్నారు. పది రోజులపాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. ఊరేగింపులు జరుగుతున్నాయి. నిమజ్జనాలూ జరుగుతున్నాయి. అటుపైన రెండు రోజులో, మూడు రోజులో ఖాళీ పందిరి, గడిచిన ఉత్సవపు స్మృతులు - ఆ తరువాత మర్చిపోవటం. ఇంతేనా యీ నవరాత్రుల ప్రయోజనం?

సామూహికోత్సవాలు గ్రామాన్నంతటినీ కలిపి ఉంచడానికీ, దైనందిన జీవనాల కార్యక్రమాలతో అలసి, విసిగిపోయిన మనుష్యులకు ఒక క్రొత్త ఉత్తేజాన్నివ్వడానికీ, మన సంస్కృతీ సంప్రదాయాలు చచ్చిపోకుండా కాపాడుకోవటానికీ చేస్తాం. మరి, తొమ్మిది రోజులు (గణపతికి) పదిరోజులు-యిలా చెయ్యటం దేనికి? మరుగున పడిపోతున్న మన కళలను, సౌందర్యకాంక్షను రక్షించుకోవడానికి. అందునా జీవితాలు పరమయాంత్రికంగా మారిపోతున్న నేటి ప్రపంచంలో యివి ఎంతో జీవాన్నిస్తాయి. పై ప్రయోజనాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొనే నడుపుతున్నారా నిర్వాహకులు? సమైక్యత కోసం చేయవలసిన ఉత్సవాలు ఊరికో పదిపందిళ్లుగా పాకిపోయాయంటే ఆ లక్ష్యం నెరవేరినట్లేనా? అమ్మవారి పందిరిని మామిడాకు తోరణాలతో, ఏ రోజుకారోజు తాజా పూలతో అలంకరిస్తున్నారా? కనీసం ముందు ఊడ్చి, కళ్లాపి చల్లి, ముగ్గు వేస్తున్నారా? ముత్తైదువలంతా పసుపు కుంకుమలతో పూజలు చేస్తున్నారా? లేదు. ఎవరికి తోచినప్పుడు వాళ్లేదో రావటం, ఓ కొబ్బరికాయ కొట్టటం, ప్రసాదం తీసుకొని

వెళ్లిపోవటం. ఇంక అది గ్రామోత్సవం ఎందుకవుతుంది?

వసూలు చేసిన చందాల డబ్బుతో ఏం చేస్తున్నారు? సినిమాలు తెచ్చి ఆడించటం, కొన్నిచోట్ల మరీ నీచపు డాన్సులు చేయించటం, ప్రసాదాలు చేయించటం. ఊరేగింపు-వీటి వలన జాతిలో ధార్మికత పెరుగుతోందా? నైతిక విలువలలో ఏమైనా మార్పులు వస్తాయా? భావిపౌరులకు సనాతనధర్మం ఏమైనా ఒంటబడుతోందా? ఇది కేవలం ఒక సంతలాగా, మేళాలాగా మారితే లాభం ఏముంది? అంచేత, మిత్రులారా,

ఆ పందిళ్లలో ప్రతిరోజూ ఓ నిర్ణీతమైన సమయానికి -

1) ఖచ్చితంగా ఆ దేవత గురించిన పౌరాణిక, చారిత్రిక గాథలను పెద్దల ద్వారా వివరింపజేయాలి.

2) ఆ ఉత్సవం, దేవతల గురించి పిల్లలలో క్విజ్ లేదా ప్రశ్నావళి ఇచ్చి ఉత్తమంగా నిలబడిన ముగ్గురికో-చాలామంది పాల్గొంటే అయిదుగురికో బహుమతులు ఇవ్వాలి.

3) ఆ దేవతకు సంబంధించిన హరికథ, పురాణం పోనీ కథ ఎవరితోనైనా చెప్పించాలి.

4) వేషధారణ పోటీలు నిర్వహించవచ్చు.

5) భజన పోటీలు నిర్వహించి ఉత్తమ భజన బృందానికి ఏదైనా (షీల్డ్) బహుమతి ఇవ్వాలి.

6) ఒకరోజు ప్రత్యేకంగా పిల్లల ప్రోగ్రామ్‌లకు, ఒకరోజు స్త్రీలకు - అలా కేటాయించి ఉత్సాహం పెంచాలి.

7) మొత్తం మీద అమ్మవారి నిమజ్జనం నాటికి గ్రామీణులందరికీ ఏదో ఒక జ్ఞానం, చైతన్యం కలిగి తీరాలి. లేకపోతే యీ ఉత్సవాలు కేవలం మందమేళంగా తయారవుతాయి. చందాలతో జేబులు నింపటం తప్ప మిత్రులారా, మీ ప్రాంతంలోని పందిట్లోకి చొరవతో చొచ్చుకు వెళ్లండి. పై అంశాలన్నీ ఉండేలా ప్రయత్నించండి.

- జై సాయిరామ్ -





# మూడు పడకలు

- శ్రీమతి హరిచందన

శ్రీ సాయిబాబా ద్వారకామాయిలో నివసిస్తోంటే - ఆయన భక్తులు ఆయనను విడిచి వెళ్లలేక ఎంతో ప్రొద్దుపోయే వరకూ అక్కడే ఉండిపోయే వారు. చివరకు అందరూ వెళ్లిపోయినా మహల్సాపతి, తాత్యా మాత్రం అక్కడే ఉండిపోయేవారు. ఏ అర్ధరాత్రో అయితే తప్ప వాళ్లు నిద్రపోయేవారు కారు. బాబాతో సహా ముగ్గురూ తలలొకేచోట పెట్టుకొని కాళ్లు వేర్వేరు మూలలకు చాపుకొని పడుకొనేవారు. అనేకానేక సద్విషయాలు వారి సంభాషణలలో దొర్లుతూ ఉండేవి. ఏదైనా మంచి విషయం చెప్పుకొంటున్నపుడు పొరపాటున మహల్సాపతిగానీ, తాత్యాగానీ కునుకుతున్నట్లనిపిస్తే - వెంటనే బాబా వాళ్ల తలలు గట్టిగా నొక్కి నిద్రలేపేసేవారు. అలా ఎన్నో సంవత్సరాలపాటు వాళ్లు మసీదులో పడుకున్నారు. బండెడు సంసారం ఉన్న మహల్సాపతీ అక్కడే - ఇంకా పెళ్లి, పేరంటమూ కాని తాత్యా అక్కడే. కొంతకాలం అయ్యాక తాత్యాకు వివాహమైంది. అయినాగానీ మసీదుకే పరుగెత్తుకు వచ్చేవాడు. చివరికి బాబాగారే అతన్ని కోప్పడి యింటికి పంపించారు. ఇంతకీ దీని ద్వారా మనం నేర్చుకొనేదేమిటి?

ఆధ్యాత్మిక మార్గంలో ముందుకుపోదలచుకున్నవారు నిరంతరం అవే విషయాలు మననం చేసుకుంటూ ఉండాలి. ఒకవేళ ఎవరైనా అలసత్వం (బద్ధకం)తో, అలక్ష్యంతో ఉంటే మిగిలినవాళ్లు వాళ్లను హెచ్చరించాలి. దారికి తేవాలి. ఐహిక విషయాలకు ఎల్లవేళలా మాయ (సపోర్ట్) ప్రోద్బలం ఉంటుంది. మాయకు ఆకర్షణ ఎక్కువ. అందునా నిన్నటివరకూ ఆ లౌకిక సుఖాలలోనూ, కబుర్లలోనూ, ఆకర్షణలలోనూ మునిగితేలినవే గదా- యీ మనసులు! అందుచేత ఏ కొంచెం సందు దొరికినా మళ్లీ అటే పరుగెత్తే ప్రయత్నం చేస్తాయి. వాటిని పట్టి నిలపడం కష్టం. దానికొక మార్గం సత్సంగం. సాధారణంగా మనుష్యులు సత్సంగం అంటే వారానికో గంటో, రెండు గంటలో నలుగురూ కూర్చొని కాస్త భజన చేసుకొని, మంచి మాటలు చెప్పుకొని లేచి చక్కా పోవటం అనుకొంటూ ఉంటారు. అది తప్పు. గతంలోనే ఓసారి చెప్పుకొన్నాం. జీవితంలో

సాధన ఒక భాగం కాదు - ఒకానొక అనంత మహాసాధనలోనే జీవితం ఓ చిన్న మజిలీ' అని. అది మర్చిపోవటం వలననే ఎప్పటికప్పుడు మాయలోకి జారిపోతూంటాం.

కొంతమంది "మేము రోజూ గుడికి వెళ్లి వస్తాం. (సాయి) రామకోటి వ్రాస్తాం. ఏవైనా పురాణాలూ, ప్రవచనాలూ అవుతోంటే తప్పకుండా వెడతాము. సంసారాల్లో ఉండి యింతకంటే ఏం చెయ్యగలం?" అంటారు. సంసార బాధ్యతలు తీరిపోయిన తరువాత కూడా చూరుపట్టుకొని వేలాడుతూ - మునిమనుమలను పెంచటం కూడా మన బాధ్యతే అనుకొంటే యిక చెప్పేదేమీ లేదు. కానీ, నిజంగా భగవచ్చింతన పెంచుకోదలుచుకుంటే మాత్రం ఎక్కడో ఒకచోట ఐహికబంధాలకు దూరంగా జరగటం అవసరం. "సంసారాన్నొక చేతా, పరమాత్మనొకచేతా పట్టుకొని ఉండండి. అవకాశం దొరకగానే రెండు చేతులతో దైవాన్నే పట్టుకోండి" అన్నారు రామకృష్ణ పరమహంస. అయితే యిక్కడో చిన్న సమస్య ఉంది. అన్నీ విడిచిపెట్టి దూరంగా వెళ్లినా తనువు మాత్రం వెళ్లి మనసు వెళ్లకపోతేనో! హిందీలో ఒక సామెత ఉంది. "ధోభీకా కుత్తా న ఘర్‌కీ, న ఘాట్‌కీ" అని. అంటే చాకలి మనిషి పెంచే కుక్క ఇంటి కాపలాకీ పనికి రాదు, రేవు కాపలాకీ పనికిరాదు" అని అర్థం. అలాగే మనసు స్వాధీనంలోకి తెచ్చుకోకుండా ఆశ్రమవాసానికి వెళ్లినా, అరణ్యవాసానికి వెళ్లినా గానీ బంధాలు తెగవు. ఉండటం ఇక్కడే - మనసు మాత్రం మామూలే. అందులోనూ సెల్‌ఫోన్ బంధాలు పెరిగాక మరీ ఎక్కువ. "మనం దూరంగా వెళ్లినా మన వాళ్లు వదలరుగా!" అంటారా? అబ్బే! వాళ్లు కాదు వదలనిది - మనమే. నిజంగా వదలదలచుకొన్నవాళ్లమైతే వాళ్ల కబుర్లు తెలియటం లేదే- అని ఎందుకు విచారిస్తాం? ఆ కబుర్లకు అందుబాటులో ఎందుకుంటాం? లోతుగా ఆలోచిస్తే మనకే సత్యం బోధపడుతుంది. ఏదో ఒక ఛేంజ్ - నిత్య జీవనంలో మార్పు కోసం, ఇంట్లో చికాకులు తప్పించుకోవటం కోసం యిల్లు వదిలి వస్తున్నామా- నిజంగా ఆధ్యాత్మిక చింతనవైపు మనసు గట్టిగా లాగుతున్నదా? ఒకవేళ లాగకపోతే దాన్ని నియంత్రించుకోవడానికి ఏం చేస్తున్నాం? - తీవ్రంగా ఆలోచించుకోవాలి.

పడవ నీళ్లలో ఉండవచ్చు. కానీ పడవలోకి నీళ్లు రాకూడదు. వాటిని రానిచ్చామా-మునగటం ఖాయం. చెరువు కట్టకు చిన్న కన్నం పడితే చాలు -





అదే గండిగా మారి కట్ట తెగ్గొట్టేంతగా చకచకా మారిపోతుంది. మనందరికీ ఇది తెలుసు. కానీ చిన్న కన్నం దశలోనే దాన్ని గట్టిగా పూడ్చే ప్రయత్నం చెయ్యం. అదే దురదృష్టం. ఈ ఒక్క అలవాటేగా! ఈ ఒక్కసారేగా! - యిలా అనుకొంటూ పాత అలవాట్లనే చక్కగా ముద్దుగా పెంచి పోషిస్తూ ఉంటాం. రిటైర్‌మెంట్ తరువాతనే టి.వి.కీ, సినిమాలకూ ఎడిక్టైపోయే వారెందరినో నేనెరుగుదును. ఆ అర్ధనగ్న చిత్రాలను, విపరీత ధోరణులలో ఉన్న పాత్రలను, అశ్లీలపు సంభాషణలను, తలా తోకాలేని కథలను చూస్తూ చూస్తూ ఉంటే మన సంస్కారాలు వెనక్కి లాగుతాయా, ముందుకు వెడతాయా? మళ్లీ మళ్లీ అవే ఉత్సవాలు, పెళ్లిళ్లు, పుట్టినరోజులు, షష్టిపూర్తులు. అదే బంధుబలగం, అవే సరసోక్తులు - యివన్నీ మన హృదయాలను తాకకుండా ఉండటానికి మనమేమైనా శుక మహర్షులమా? అడుసు తొక్కనేల - కాలు కడగనేల? ఇవన్నీ గ్రహించుకొని, ఎలా జీవించాలో ఒక పద్ధతి ఏర్పరుచుకోవాలి. మన కడపటి క్షణం ఎప్పుడో మనకు తెలియదు. క్షణక్షణం స్వామినే ధ్యానిస్తూ ఉంటే ఏ క్షణంలో కన్ను మూసినా కైవల్యమే. అదే మనం గుర్తుంచుకోవలసిన విషయం.

సాయిబాబా తనకు చేరువగా వచ్చిన వారిని నిరంతరం సద్విచారాల వైపు ప్రోత్సహిస్తూ ఉండేవారు. 'రేపంతా రామనామ స్మరణతో గడపాలి' అనుకొన్న వారికి ఉదయాన్నే అది గుర్తు వచ్చేట్లు చేసేవారు. దారి తప్పతున్న వారిని మందలించి దారికి తెస్తుండేవారు. విజయానందుడనే సాధువు తన కడపటి రోజులలో తల్లిని చూడటానికి వెడతానంటే "మమకారం వదలలేని వాడికి సన్యాసం ఎందుకు?" అని మందలించి అతని చివరిక్షణాలు దైవచింతనతోనే గడిచేలా చేసారు. అలాగే మనం కూడా ఒకరికొకరు సహకరించుకొంటూ, ఒకరెవరైనా మాయలో కూరుకుపోతుంటే మళ్లీ పైకి రావటానికి తోడ్పడాలి. వీలైనంతవరకూ సంసారాల గురించీ, బంధువుల గురించీ, లౌకిక విషయాల గురించీ మాటలు తగ్గించెయ్యాలి. అవతలి వారు చెప్తున్నా నిర్మొహమోటంగా 'ఏదైనా దేవు(డి కబుర్లు చెప్పకుందాం' అని దారి మళ్లించాలి. మనం ఎక్కడ, ఎవరితో, ఏమి మాట్లాడుతున్నా, 'ఇది నా సాధనకు పనికి వచ్చేదేనా?' అని ప్రశ్నించుకోవాలి. అలా కాకపోతే "ఏం తప్పలేదులే" అనుకొంటూనే, మనని మనం మోసపుచ్చుకొంటూనే, జీవితమంతా వ్యర్థం చేసుకున్న వాళ్లమవుతాం. తస్మాత్ జాగ్రత్త! ★

## బాలవాణి

# ఓ సంచి ముందుకూ, ఓ సంచి వెనక్కూ

మనలో కొన్ని మంచి గుణాలూ, కొన్ని చెడ్డ గుణాలూ ఉంటాయి. అలాగే ఎదుటివారిలో కూడా ఉంటాయి. అయితే మనకు ఎదుటివారిలోని తప్పులు చాలా పెద్దవిగానూ, మన తప్పులు చిన్నవిగానూ కన్పిస్తుంటాయి. అందుకే పెద్దలు ఏం చెప్తారంటే-'మీ వీపు వెనక్కు ఓ సంచీ, ముందుకు ఓ సంచీ తగిలించుకోండి. ఇతరుల మంచిగుణాలన్నీ ముందరి సంచిలోనూ, చెడ్డ గుణాలన్నీ వీపు వెనుక సంచిలోనూ వేసుకోండి. మీరు చేసిన మంచి పనులన్నీ వెనక్కూ, చెడ్డపనులన్నీ ముందుకూ వేసుకోండి' అని. దీనివలన మనలోని చెడు దిద్దుకోవడానికి వీలవుతుంది, ఈ పాఠం నేర్చుకొన్న మంచి అబ్బాయి, గోకులుడి కథ వినండి -

గోకులుడూ, సౌమిత్రీ మిత్రులు. ఇద్దరూ ఒకే బడిలో చదువుకొనేవారు. ఎప్పుడైనా చిన్న చిన్న విషయాలలో పేచీ వస్తే తాత్కాలికంగా దెబ్బలాడుకొనేవారు- మళ్లీ అంతలోనే కలిసిపోయేవారు. అయితే వాళ్లిద్దరిలోనూ సౌమిత్రి హృదయం మంచిది. ప్రతిరోజూ రాత్రిపూట పడుకొనేముందు కాళ్లు, చేతులు, ముఖం, మెడ కడుక్కొని వచ్చేవాడు. పక్కమీద కూర్చొని దైవధ్యానం చేసుకొనేవాడు. ఆ రోజంతా తాను మంచి పనులు చేసాడో, పొరపాట్లు చేసాడో ఆలోచించుకొంటూ పడుకొనేవాడు. అందులో ఏమైనా తప్పులుంటే-అలా చేసినందుకు భగవంతుడిని క్షమార్పణ చెప్పకొంటాడు. మరునాడు మళ్లీ అలాంటి పొరపాట్లు చెయ్యకుండా ఉండాలని అనుకుంటాడు. అన్నీ మంచి పనులు చేసాననుకుంటే-తనకు అలాటి శక్తి ఇచ్చినందుకు భగవంతుడికి కృతజ్ఞత చెప్పకొని నిద్రపోతాడు. ఇవన్నీ వాళ్ల అమ్మ నేర్పింది వాడికి. గోకులుడు కూడా మంచివాడేగానీ కొంచెం దుడుకుతనం ఎక్కువ.

ఓ రోజు ఇద్దరూ నది ఒడ్డున ఇసుకతిప్పల మీద ఆడుకోవడానికి వెళ్లారు. ఇద్దరికీ బాగా ఈతవచ్చు. నదీతీరపు ఊరుగనుక దాదాపుగా ఊళ్లో పిల్లలందరికీ ఈత వస్తుంది. సౌమిత్రికి కొద్దిగా వచ్చుగానీ గోకులుడికి బాగా వచ్చు. అచేత వాళ్లు ఏ భయం లేకుండా నదీతీరానికి వచ్చి ఆడుకొంటూ ఉండటం మామూలే. సరే- ఓ గంటసేపు ఆడుకొని, మిగిలిన మిత్రులంతా





వెళ్లిపోయినా మన వాళ్లిద్దరూ మరికాస్సేపు కబుర్లు చెప్పకొంటూ ఉండిపోయారు. వాళ్ల బడిలో జరిగిన ఏదో చిన్న విషయం మీద ఇద్దరికీ చిన్న వాదం వచ్చింది. అలాఅలా అది పెరిగి పెద్దదైంది. సహజంగా దుడుకువాడైన గోకులుడు సౌమిత్రి చెంప మీద గట్టిగా కొట్టాడు. సౌమిత్రికి కూడా కోపం వచ్చింది. కానీ, తమాయించుకున్నాడు. కొద్దిసేపయ్యాక, ఓ చిన్నపుల్ల తీసుకొని "గోకుల్ నన్ను కొట్టాడు" అని తడి ఇసుక మీద వ్రాసాడు. ఇంకేమీ అనకుండా ఇంటిదారి పట్టాడు. గోకులుడు కొంచెం ఆగి సౌమిత్రి వ్రాసింది చదివి మరీ ఇంటికి వెళ్లాడు.

మర్నాడు యథాప్రకారం బడిలో కలుసుకున్నాగానీ ఇద్దరూ మాట్లాడుకోలేదు. సాయంత్రం అందరితోపాటే నది ఒడ్డున ఆడుకోవడానికి వెళ్లారు. అప్పటికి కూడా మాటలు కలవలేదు. సరే అంతా అయిపోయాక-అందరూ కాళ్లు, చేతులు కడుక్కోవడానికి నదిలో దిగారు. సౌమిత్రి కొంచెం లోపలికి వెళ్లి కడుక్కుంటున్నాడు. అతను వంగి ముఖం కడుక్కొంటున్న వాడికి కాస్తా ఏమయిందో ఏమో - గభాల్న బోర్ల పడిపోయాడు నీళ్లలో. అసనాటుగా ఉన్నాడేమో చటుక్కున లేవలేకపోయాడు. నీటివేగానికి తట్టుకోలేకపోయాడు. ముక్కులోకీ, నోట్లోకీ నీళ్లు పోయాయి. ఉక్కిరిబిక్కిరైపోతూ నీటిలో కొట్టుకు పోయే స్థితికి వచ్చాడు. ఇదంతా గమనిస్తున్న గోకుల్ చటుక్కున ఈదుకుంటూ వెళ్లి సౌమిత్రిని ఒడిసిపట్టుకొని ఒడ్డుకు లాక్కువచ్చాడు. ఒడ్డున పడుకోబెట్టి పొట్టనొక్కి లోపలి నీళ్లు కక్కేలా చేశాడు. అప్పటికి సౌమిత్రి కొద్దిగా తేరుకున్నాడు. దానితో గోకులుడు వాడిని వదిలి దూరంగా వెళ్లిపోయాడు. కాస్సేపటికి సౌమిత్రి బాగా తేరుకొని లేచాడు.

చీకటి పడబోతోంది. పిల్లలంతా ఇళ్లకు బయలుదేరారు. సౌమిత్రి మాత్రం దగ్గరలోని పెద్ద బండరాతి మీదికి చేరుకున్నాడు. ఓ గట్టి రాతితో ఆ బండ మీద ఏదో చెక్కసాగాడు. కొంచెంసేపయ్యాక గోకులుడు ఆసక్తితో మెల్లగా వెళ్లి, సౌమిత్రి వెనకే నిలబడి వాడు చెక్కేది చదివాడు. "గోకులుడు ఇవ్వేళ నా ప్రాణాలు కాపాడాడు" అని ఉంది. గోకులుడు సౌమిత్రి ఎదుటికి వెళ్లాడు. సౌమిత్రి చిరునవ్వు నవ్వాడు. గోకులుడు కూడా నవ్వి, "నిన్న నేను కొట్టినప్పుడు ఇసుక మీద వ్రాసావు ఆ సంగతి. ఇప్పడేమో ఇలా రాతి మీద చెక్కావు-ఎందుకని?" అని అడిగాడు.

సౌమిత్రి గోకులుడి చెయ్యి పట్టుకున్నాడు. “నువ్వు నా మిత్రుడివి. ఏదో తొందరపడి కొట్టావు. అది నేను గుర్తుంచుకోకూడదు. అందుకనే ఇసుక మీద వ్రాసాను. నదిలోని నీళ్లు ఆటుపోట్లతో ఒడ్డుకు వస్తే ఆ అక్షరాలు చెరిగి పోతాయిగా! ఇవ్వేళ నువ్వు చేసిన మేలు నేను జన్మంతా గుర్తు పెట్టుకోవాలి. అందుకే ఇక్కడ వ్రాసాను” అన్నాడు. గోకులుడికి సిగ్గువేసింది. ఇంకెప్పడూ తాను దుడుకు పనులు చెయ్యకూడదు. స్నేహితులలోని చెడు మర్చిపోవాలి. మంచే గుర్తుపెట్టుకోవాలి” అనుకొన్నాడు. మిత్రులిద్దరూ చేతులు పట్టుకొని నడిచిపోయారు.

✡

# తన కర్మకు తానే కర్త

**- స్వామి వివేకానంద**

పిరికివాడు, పనికిమాలిన మూర్ఖుడు మాత్రమే ‘ఇది విధివ్రాత’ అంటాడని సంస్కృత సుభాషితం చెప్తోంది. దృఢంగా నిలబడి, ‘నా కర్మకు నేనే కర్తను’ అనే వాడే ధైర్యవంతుడు. ముసలితనం మీదపడుతున్న వారే విధిని గురించి మాట్లాడుతారు. యువకులు సాధారణంగా జ్యోతిష్యం జోలికి పోరు. ఒక వ్యక్తి శీలాన్ని నిర్ణయించడానికి అతడు చేసిన ఘనకార్యాలను పరిగణించకూడదు. ప్రతి మూర్ఖుడూ ఎప్పడో ఒకప్పడు మహావీరుడై వెలగవచ్చు గాక! ‘సర్వ సామాన్యమైన పనులను చేసేటప్పడు వ్యక్తిని పరిశీలించు. నిజానికి ఒక మహావ్యక్తి శీలాన్ని నిర్ణయించడానికి అతడు చేసిన ఘనకార్యాలను పరిగణించ కూడదు. ప్రతిమూర్ఖుడూ ఎప్పడో ఒకప్పడు మహావీరుడై వెలగవచ్చును గాక! ‘సర్వసామాన్యమైన పనులను చేసేటప్పడు వ్యక్తిని పరిశీలించు. నిజానికి ఒక మహావ్యక్తి శీలాన్ని తెలియజెప్పేది యీ సాధారణమైన పనులే. గొప్పగొప్ప సందర్భాలు అత్యంత సామాన్యుడికి సైతం ఒక తరహా, ఘనతను ఆపాదిస్తాయి. కానీ, ఏ వ్యక్తి శీలం ఎల్లవేళలా-అతడెలాంటి పరిస్థితిలో ఉన్నా-ఒకేరీతిగా విశిష్టంగా ఉంటుందో, అలాంటివాడు మాత్రమే నిజంగా గొప్పవాడు.

ఏ రకమైన ప్రతిఫలాన్నీ ఆశించకుండా, మనం ప్రపంచానికి అందించిన



సాయి వాణి

ప్రతి సద్భావనా లోకంలో పదిలమై, శృంఖలాశ్రేణిలో ఒక దాన్ని ఛేదించి, కర్మబంధాన్ని సడలించి మనలను మరింత పవిత్రులను చేస్తుంది. నువ్వు గనుక ఈర్ష్యాద్వేషాలను వెలిబుచ్చితే, అవి చక్రవడ్డీతోసహా నీ మీదికే మరలివస్తాయి. ఏ శక్తీ వాటిని ఆపలేదు. ఒక్కసారి నువ్వు దానికి అవకాశం ఇస్తే ఫలితాన్ని అనుభవించవలసిందే. ఇది నువ్వు గుర్తిస్తే చెడుపనులను చెయ్యకుండా అది నిన్ను నిరోధిస్తుంది. ప్రకృతిని ప్రతిఘటించే ప్రతిదీ చైతన్య వంతమే. అలాంటి సందర్భాలలో చైతన్యం ప్రస్ఫుటమవుతుంది. ఒక చిన్న చీమను చంపాలని ప్రయత్నించు, ఆ అల్పప్రాణి సైతం తన ప్రాణరక్షణకై తక్షణమే ప్రతిక్రియను చూపిస్తుంది. ఎక్కడెక్కడ పోరాటముందో, ఎక్కడెక్కడ తిరుగుబాటు వుందో అక్కడ జీవముందని అర్థం. ఆయా తావులలో చైతన్యం ప్రకటితమవుతోంది.

ధనాన్ని ఆర్జించేది మానవుడే గదా? ఎక్కడైనా ధనం మానవుణ్ణి కల్పించినదని విన్నామా? నీ తలపులకు, చేతలకు సామరస్యం కల్పించగలిగితే - మళ్లీ మళ్లీ నొక్కి వక్కాణిస్తాను - నీ మాటలు, చేతలు ఒకేరీతిలో ఉంటే ధనం దానంతట అదే మంచినీళ్లప్రాయంగా నీ పాదాల చెంతకు వచ్చిపడుతుంది. ఈ విశ్వంలో మంచికి నిర్దేశించబడ్డ మార్గం కఠినాతి కఠినం. ఆ మార్గాన్ని అనుసరించి ఎందరో అపజయం పొందారనటంలో వింతలేదు. ఎందరో విజయం పొందారనటం అద్భుతం. వేలకొద్దీ తడబాట్లు, పొరపాట్లు చెయ్యడం ద్వారానే సచ్ఛీలస్థాపన జరగవలసి వుంది. అవహేళన, ప్రతిఘటన పిమ్మట అంగీకారం అనే మూడు మజిలీల గుండా ప్రతి కార్యమూ సాగితీరాలి. తనకాలం కంటే ముందుకు చూపు సారించి ఆలోచించే ప్రతి వ్యక్తీ అపార్థాలు అనుభవించక తప్పదు. అందుచేత ప్రతిఘటన, తిరుగుబాటు ఆహ్వానించదగ్గవే. నిదానంగా పవిత్రంగా ఉండి భగవంతుడిపై అపార విశ్వాసాన్ని కలిగి వుంటే- యీ ప్రతిఘటన, తిరుగుబాటు అన్నీ మటుమాయమౌతాయి. వస్తుతః ప్రతి ఆత్మా దివ్యమైనదే. ఆంతరికం, బాహ్యం అయిన ప్రకృతిని నియంత్రించటం ద్వారానో, భక్తిమార్గంలోనో, యోగసాధన వల్లనో, వేదాంతజ్ఞానం మూలంగానో- లేక వీటిలో ఏదైనా ఒక మార్గం అవలంబించైనా, అన్నింటినీ కలిపి ఆచరించైనా ఈ లక్ష్యాన్ని సాధించి ముక్తిని సాధించాలి. ఇదే మత సర్వస్వం.

◎

# ఆరోగ్య

**సాయిధామం - 508126**

ప్రియ మిత్రులారా,

మనిషి ప్రకృతిలోని ఒక భాగం. అది మరచిపోయి తాను సృష్టించుకొన్న యంత్రాలకు బానిసై బ్రతుకుతున్నాడిపుడు. కృత్రిమ ఎరువులు, కృత్రిమ పాలు, కృత్రిమ దుస్తులు. మనది కాని కృత్రిమ నాగరికత - మొత్తం కృత్రిమంగానే జీవిస్తున్న నేటి మానవుని ఆరోగ్యం కూడా కృత్రిమంగానే తయారవటంలో ఆశ్చర్యం ఏముంది? మందులూ కృత్రిమంగా తయారయ్యేలే. ఇక మనం బ్రతికేదెలా? అసలు వ్యాధులే రాకుండా అడ్డుకోవటానికి మనకు మార్గం లేదా? ఉన్నది. అదే ప్రకృతి వైద్యం .. దానికి తోడు యోగ. ఒకవేళ యిప్పటికే వ్యాధిగ్రస్తులై ఉంటేనో! ప్రకృతి వైద్యం, యోగాలకు తోడు కొద్దిపాటి ఆక్యుప్రెషర్ సీడ్ థెరపీ, ఆయుర్వేదం, హోమియో వైద్యం. ఎలాంటి వ్యాధయినా సరే - ఏ మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ (వైద్యానంతర బాధలు) లేకుండా బాగు చేయవచ్చు. అలోపతీ వైద్యపు ఖర్చుతో ఏ మాత్రం పొంతనలేని అతి తక్కువ ఖర్చుతో వ్యాధులు పోగొట్టుకొని మీ ఆరోగ్యం కుదుటపరచుకోవచ్చు.

దీని కోసం మన సాయిధామం ఆశ్రమంలో "ఆరోగ్య" అన్న పేరిట ఒక ప్రకృతి వైద్యశాల ఏర్పడింది. దీనిలో యోగ, ఆక్యుప్రెజర్, ఆహార వైద్యం, ఆవిరి స్నానం, అయస్కాంత వైద్యం, మృత్తికా స్నానం వంటి ఎన్నెన్నో ప్రక్రియల ద్వారా వ్యాధి నివారణ జరుగుతుంది. దీనికి అనుబంధంగా హోమియో వైద్యం కూడా నడుస్తున్నది.

మోకాళ్ల నొప్పులు, ఊబకాయం (అధిక బరువు), థైరాయిడ్, అజీర్తి, మానసిక వ్యాధులు, బి.పి, షుగర్, ఆయాసం, కీళ్లవాతం, గేస్ట్రిక్ ట్రబుల్స్, మూత్రపిండ వ్యాధులు, నరాల బలహీనత, కొలెస్ట్రాల్ - వంటి వ్యాధులెన్నిటికో మీకు చక్కని ప్రశాంత వాతావరణంలో, దైవ సన్నిధానంలో వైద్యం లభిస్తుంది. వివరాలకు దిగువ నెంబర్లకు ఫోన్ చేయండి.

**ధర్మాధికారి : 9440413455**

**డా॥ స్వర్ణకుమారి : 9704744493**





# ధన్యత

- నాగ గౌరీకుమారి, కాకినాడ

నేను కాకినాడ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాను. సాయిధామానికి వెళ్లాలని చాలాసార్లు అనుకున్నాను. కానీ, టైమ్ చాలక ఏదో పని చూసుకొని వెళ్లిపోవటం జరుగుతున్నది. ఎప్పటినుంచో సాయిధామం చూడాలన్న నా కోరికను ఆ సాయినాధుడు ఎలా తీర్చాడో మీకు వివరంగా నా అనుభూతిని తెలియపరుస్తున్నాను.

పూజ్యులు, గురువర్యులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభూజీ వారు, మాతాజీవారు, ప్రవచనాలకై తదితరులతో అనపర్తి రావడంతో వారి దర్శనానికై నేను, మా అమ్మగారు అనపర్తి వెళ్ళాము. మరునాడు అందరం కలిసి బలభద్రపురం, అక్కడ నుంచి పిఠాపురంలో ఉన్న శ్రీపాద శ్రీ వల్లభ దర్శనానికై బయలుదేరాము. దారిలో మాతాజీగారు, గురువుగారితో శయన సాయిబాబాను చేయిద్దామనీ, ఉయ్యాలలో వేద్దామనీ అనడం, వెంటనే నా మనస్సులో సాయిని చేయించాలనే సంకల్పాన్ని బాబా నాకు కలిగించడం జరిగాయి. దీని నిమిత్తం అయ్యే ఖర్చును పంపిస్తానని అన్నాను.

ఇది జరిగిన నాలుగు రోజులకు మాతాజీగారు ఫోన్ చేసి "డబ్బు పంపించవద్దు. నీవే దగ్గరుండి అన్నీ జాగ్రత్తగా చూసి చేయించు" అని నా మీద పెద్ద బాధ్యత పెట్టారు. నేను వెంటనే బాబా పటం ముందు నిలబడి "ఎలా చేయించాలి, ఎవరు చేస్తారు? ఆ చేసే వాళ్లను నాకు చూపించు తండ్రీ!" అని ప్రార్థించాను.

తర్వాత రాజమండ్రిలో ఉన్న మా స్నేహితురాలు లక్ష్మిగారింటికి వెళ్లడం, అక్కడ మాటల మధ్యలో ఆమె అన్నయ్యగారు ధవళేశ్వరంలో ఉన్న పెదపాటి శ్రీనివాసు గారితో విగ్రహాలను చేయించినట్లు చెప్పడం, వెంటనే మేమందరం కలిసి ధవళేశ్వరం వెళ్లి శయన సాయిబాబాను పంచలోహాలతో తయారు చేయించడం అంతా చాలా చక్కగా జరిగింది.

సాయిబాబాను తయారైన వెంటనే హైదరాబాదులో ఉన్న సాయిధామానికి ఇచ్చేద్దామనుకుంటే మాతాజీగారు గురుపూర్ణిమ రోజున నీవే వచ్చి బాబాను ఉయ్యాలలో వేయి అని ఆజ్ఞాపించారు.

గురుపూర్ణిమనాడు బాబాగారు నన్ను జాగ్రత్తగా తనతోపాటు సాయిధామానికి తీసుకువచ్చారు. సాయిధామం పచ్చని చెట్లతో, చిన్న గుట్టలతో చాలా ప్రశాంతంగా ఉంది. అక్కడ ధ్యానముద్రలో ఉన్న బాబాగారిని చూడగానే నా మనసు పులకరించిపోయింది. తర్వాత సాయిబాబా వారి శయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఉయ్యాలలో వేసి "యీ సేవతో నన్ను కరుణించావు తండ్రీ" అని మనసారా ప్రార్థించాను. మధ్యాహ్న హారతి అయిన తర్వాత సాయి ప్రసాదం తీసుకున్నాము. ఇక వెళ్లాలి. కానీ తృప్తి తీరలేదు. ఈసారి సాయిధామం వచ్చినపుడు నాలుగు రోజులు ఉండాలని నిశ్చయించుకున్నాను. ఈ విధంగా కీసరలో ఉన్న సాయిధామానికి బాబావారే స్వయంగా నాకు తోడుగా ఉండి నన్ను తీసుకువచ్చి నా కోరిక నెరవేర్చారు.

సాయంత్రం గురువుగారి దగ్గర, మాతాజీగారి దగ్గర ఆశీర్వాదములు తీసుకొని బయలుదేరి వచ్చాము.

"తండ్రీ సాయినాథా, ఈ గడ్డ మీద పుట్టినందుకు, మీ పవిత్రమైన పాదాలు పట్టినందుకు నా జన్మ ధన్యమైనదని భావిస్తున్నాను. సర్వకాల సర్వావస్థల యందు మాకు తోడుగా, నీడగా ఉండి కాపాడు తండ్రీ" అని సాయినాధునికి మనసారా ప్రార్థిస్తున్నాను.

**Life is full of opportunities. If they don't present themselves to you - look for them, create them. You should not wait for someone to knock at your door. Why not open it yourself? You are inside, comeout into the field of infinite opportunities in the world around you.**

**- Swamy Chidananda**



సాయి వాణి

# అద్భుత మంత్రం

- దాదా జె.పి. వాస్వానిగారి మాతృకకు అనుసరణం

21వ శతాబ్దిలో - యివ్వేళ ఎన్నెన్నో సమస్యలతో, ఒత్తిళ్లతో, ఒంటరినన్న భావనతో, జీవితాన్ని శిల నిర్మాణం చేసుకోని నడుపుకోలేని దైన్యంతో, ఎవ్వరితోనూ కలవలేని అసమగ్రతతో అల్లాడుతున్న మానవుడికి ఒకే ఒక్క తారకమంత్రం ఉంది. "నేను ఒంటరిని కాను - భగవంతుడు నాకు తోడున్నాడు" - ఈ విశ్వాసమే ఆ మంత్రం.

నిత్యమూ దైవం మనతో ఉన్నాడన్న నమ్మకం నీకు జీవితం పట్ల ఒక భద్రతా భావాన్ని కలిగిస్తుంది. సమస్యలను ఎదుర్కోగల స్థైర్యం కలిగిస్తుంది. ప్రశాంతంగా, నిశ్చింతగా జీవించగల శక్తినిస్తుంది.

మిలన్ అనేచోట ఓ పెద్ద చర్చి ఉంది. దానిలో పై గేలరీలలో అద్భుతమైన పాలరాతి బొమ్మలు చెక్కుతున్నాడొక శిల్పి. గొప్ప అంకితభావంతో అపురూపంగా రాళ్లకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్న ఆ శిల్పి దగ్గరకు ఒక మిత్రుడు వచ్చాడు. "ఏమిటయ్యా, యింతటి ప్రతిభను వ్యర్థం చేస్తున్నావు? ఇంత ఎత్తు మీదికి ఎక్కి వచ్చి ఎవరు చూస్తారు ఈ శిల్పాలన్నీ?" అన్నాడు.

"నీవు వచ్చావు - నా శిల్పం విలువను గ్రహించావు. చాలదూ!" అన్నాడు శిల్పి నవ్వుతూ. "ఈ మెట్లన్నీ ఎక్కి రాలేక నేను రాకపోతే యీపాటి సందర్శకుడు కూడా ఉండేవాడు కాడుగా!" అన్నాడు మిత్రుడు కూడా నవ్వి. శిల్పి తన పని తాను చేసుకుంటూనే తలెత్తి చూచాడు. "మిత్రమా, పరమాత్ముడూ, దేవదూతలూ వచ్చి చూస్తారుగా తప్పకుండా. అది సరిపోతుందిలే" అన్నాడు. భగవంతుడు ఎల్లవేళలా తనకు తోడై ఉంటాడని ఆ శిల్పికెంత నమ్మకం!

ఓ పిల్లవాడు వాళ్లమ్మను అడక్కుండా కొన్ని మిఠాయిలు తీసుకొని తిన్నాడు. వాడి తల్లి మందలింపుగా "నీకు తెలియదటరా దేవుఁడు చూస్తూనే ఉంటాడని. అలాటి దొంగపని చేయవచ్చునా?" అన్నది. వాడు "నేను తియ్యటం చూచి

ఉంటాడుగానీ తినటం చూచి ఉండడు లేమ్మా! నేను టేబుల్ కింద దూరి తిన్నానుగా!" అన్నాడు.

నీకు తోడుగా భగవంతుడెప్పడూ ఉన్నాడన్న విశ్వాసం నీకుంటే - ఆ మహాశక్తి సహకారం అందుతుందన్న నిశ్చింత నీలో నిండుతుంది. ఆయన నీకు అవసరమైన శక్తీ, వివేకం యిస్తాడనీ, వాటి సాయంతోనే నీకు ఎదురయ్యే సంకటాలనూ, చికాకులనూ, ఆందోళననూ జయింపగలవనీ నీకు తెలుస్తుంది. అదే నీకు శ్రీరామరక్ష అవుతుంది.

అలాటి విశ్వాసం నీకు అత్యంత సహజంగా రావాలి. ఒకవేళ రాలేదనుకో - పదేపదే నీకు నీవే చెప్పకోవాలి. "భగవంతుడు నన్ను గమనిస్తూనే ఉన్నాడు, గమనిస్తూనే వున్నాడు" అని. అలా చెప్పకొంటూంటే పరీక్షల నెదుర్కొనే శక్తి దానంతటదే వస్తుంది. కొంతకాలానికి భగవద్విశ్వాసం బలపడిపోతుంది.

సర్కస్‌లో దొమ్మరివాళ్లను చూడండి. మృత్యువు నోట్లోకి వెళ్లి వస్తున్నారా అన్నట్లుగా ఫీట్లు చేస్తుంటారు. ఎంతో ఎత్తున కట్టిన తీగ మీద దాదాపుగా శూన్యంలో నడుస్తున్నట్లే నడుస్తారు. క్రింద చూచేవాళ్లు ఆశ్చర్యంతో వేసే కేకలు, పిల్లల అల్లరి - ఏవీ వాళ్ల ఏకాగ్రతను భంగపరచలేవు. వాళ్ల ప్రశాంతతను దెబ్బ తీయలేవు. వాళ్లను అడగండి - అదెలా సాధించారని. అందరూ ఏకకంఠంతో చెప్తారు. "భగవంతుడు మాకు తోడున్నాడన్న నమ్మకంతోనే అలా నడవటం మొదలు పెడతాము. అదే మాకు దన్నునిస్తుంది" అని.

మీరూ, నేనూ అలా సర్కసు వాళ్లం కాదు గదా అంటారా - కాక మరేమిటో చెప్పండి. ఎటొచ్చీ మనం నడుస్తున్న గాలిలో తాడు మన జీవితమే. మరి సర్కస్ వాళ్లు నేర్చుకున్న పాఠం మనమూ నేర్చుకొన్నామనుకోండి. వాళ్లలాగే మనం కూడా ప్రశాంతంగా, సమతుల్యతతో నిశ్చింతగా ఉండగలుగుతాం కదూ! అంచేత అదే మన నిరంతర జపం కావాలి - "ఆయన నాకు తోడున్నాడు". అయితే యిది కష్టాలలోనూ, అవసరమైనప్పడు మాత్రమే అనాలా? అలా కుదరదు. అదొక మంత్రంగా నిద్రలో, మెలకువలో నిరంతరం క్షణక్షణం మన స్పృహలో ఉంటేనే - మనకు అవసరమైనపుడు గుర్తు వస్తుంది. ఈ అద్భుతమైన విశ్వాసంతో ప్రభాతాన్ని ప్రారంభిస్తే స్వచ్ఛత, ప్రేమ, సంతోషం, శాంతి నీ





ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో కలిసిపోతాయి. చీకట్లను సూర్యకాంతి చెదరగొట్టినట్లే యీ భగవత్ స్పృహ నీ లోపలి నిరాశను, చిరాకులను, నిన్ను బెదిరించే కారు చీకట్లన్నిటినీ సుదూరతీరాలకు విసిరి పారేస్తుంది. అంచేత భగవంతుడు తోడై ఉన్నాడన్న భావనను దృఢంగా పట్టుకోండి.

ఓసారి ఓ స్టీమరు సముద్రం మీద వెడుతుండగా తుఫాను వచ్చింది. ఓడ భయంకరమైన కుదుపులకు లోనైంది. ప్రయాణీకులంతా విశ్రాంతిగా కునుకు తీస్తున్న వారు కాస్తా ఉలికిపడి లేచారు. భయాందోళనలతో కొందరు హాహాకారాలు కూడా ప్రారంభించారు. ఓడ డెక్ మీద నిద్రపోతున్న కెప్టెన్ కూతురు ఎనిమిదేళ్ల పిల్లకు కూడా యీ గోలకు మెలకువ వచ్చింది. "ఏమైందమ్మా, ఎందుకు గోల చేస్తున్నారు?" అని తల్లిని అడిగింది. తల్లి తుఫాను వచ్చిందనీ, ఓడ కుదిపేస్తోందనీ చెప్పింది. పిల్ల "నాన్నగారు చుక్కాని దగ్గర ఉన్నారా?" అని అడిగింది. అవునన్నది తల్లి. పిల్ల పక్క మీదనే కాస్త అటూ కదిలి మళ్లీ నిద్రపోయింది. గాలులు బలంగా వీస్తున్నాయి. అలలు ఎగిరిపడే శబ్దం, నౌక ఊగిసలాట - అన్నీ అలాగే ఉన్నాయి. కానీ, పాప నిశ్చింతగా నిద్రపోయింది. "నాన్నారు చుక్కాని దగ్గరున్నారు, అన్నీ ఆయనే చూచుకుంటారు" - యిదీ ఆమె నిశ్చింతకు కారణం. మరి మనందరి తండ్రీ అయిన పరమాత్ముడు మన జీవననౌకను చుక్కాని పట్టి నడపడా? ఎన్ని తుఫానులు రానీ, పిడుగులే పడనీ ఆయన మీదనే అన్నీ వదిలివేసి ఎందుకు ఉండకూడదు? మన జీవన మార్గాలలో ప్రయాణిస్తున్నప్పడు చిన్నవీ, పెద్దవీ, మామూలువీ, భయంకరమైనవీ - ఎటువంటి యిక్కట్లు రానీ గాక - మన మంత్రం ఒక్కటే - "భగవానుని ప్రేమ నిర్భరమైన కాపు మనకున్నది. ఆయనే రక్షిస్తాడు".

పరమాత్మ నిత్యకరుణాళువు. ఆయన మనకిచ్చే ఆవేదనలు, కోపాలు, ఆందోళనలు, కష్టాలు ఊరికే మనను బాధించడానికివ్వడు. మనలో విజ్ఞత, వివేకం, ఓర్పు, క్షమ, అవగాహన పెరగడానికిస్తాడు. ఆయన మననుంచీ దూరం చేసేవీ, మనకు ఇచ్చేవీ కూడా మనకు మేలు చెయ్యడానికేనని దృష్టిలో ఉంచుకోవాలి. మనకు లోచూపు పెరిగినపుడు, భగవంతుడు మనను గమనిస్తూనే ఉన్నాడన్న స్పృహ మనలో దృఢపడినపుడు, ఆయనే మన

జీవితాలను నడిపిస్తున్నాడన్న విశ్వాసం కలిగినపుడు - అసలు మన జీవితాలనే కాదు, యావత్ప్రపంచాన్నీ ఆయనే నడుపుతున్నాడన్న విశ్వాసం కలిగినప్పుడు - మన హృదయాంతరాళాలలో ఒకే ఉద్దేశ్యం కదలాడుతుంది - "ప్రభూ, నా సంకల్పం కాదు - నీ సంకల్పమే జరుగుతుంది" అని.

ఇబ్బందులు కలుగుతున్నప్పుడు చికాకులు, అసంతుష్టి - యివన్నీ భగవంతుని ప్రసాదాలుగానే భావించాలి. అప్పడు మనకు స్పష్టమవుతుంది- "మనం ఒంటరిగా లేము-భగవంతుడు మనకు తోడుగా ఉన్నాడు" అని. అంచేత దుఃఖం, కోపం మనను మ్రింగెయ్యకముందే మనం దుఃఖాన్నీ, కోపాన్నీ మింగేద్దాం.

❄

# నమస్కారం ఎందుకు చెయ్యాలి!

**సేకరణ : కె.ఆర్.విజయకుమార్**

ఇరువురు వ్యక్తులు కలుసుకోగానే (సమవయస్కులైనా, వివిధ వయస్సు వారైనా, స్త్రీ, పురుషులైనా) 'నమస్కారం' అని చెప్పకోవడం మన హైందవ సంస్కృతిలో పేర్కొనదగిన అమోఘమైన అంశం. కానీ ప్రస్తుత రోజుల్లో పేర్కొన దగిన అమోఘమైన అంశం. కానీ ప్రస్తుత రోజుల్లో 'హాయ్' అనే పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడింది మన హైందవం. అందుకు కాస్తంత విచారించాల్సిందే! పరస్పరం నమస్కరించుకోవడం ఎందుకు? అనే ధర్మసందేహం కలగడం సహజమైనదే. నమస్కరించేటప్పడు రెండు చేతులు మనం జోడిస్తాం. 'న మ' అంటే 'నేను' కాని అని అర్థం. అంటే నాలో ఉన్న 'నేను' అనే అహం పూర్తిగా వైదొలగి నిన్ను సేవిస్తోంది అని అర్థం. ఇదే మరో కోణంలో పరిశీలించుకుంటే ............. నాలో ఉన్న భగవానుడే నీలోనూ ఉన్నాడు. గనుక నాలో ఉన్న భగవానుడే నీలోనూ ఉన్నాడు. గనుక నీలోని భగవానునకు నేను నమస్కరిస్తున్నాను అని అర్థం. నేను పూర్తిగా అహం దిగిన జీవన్ముక్తుడుగా ఉన్నానని చెప్పడమన్నమాట!





# మన వంతు పని

**- మాతాజీ**

భగవద్గీత ఒక అమృతవాహిని. ఇది ఆలోచనామృతం - అంటే ఆలోచించే కొద్దీ అమృతమయమైన విషయాలను అందించగలదని అర్థం. భావాలు భగవానునివి - స్వయం పరమాత్ముడైన శ్రీకృష్ణునివి. ఇక మాటలా? వ్యాస భగవానులవి. ఒక్కొక్క చిన్నమాటలో, ఒక్క సంబోధనలో, ఒక్క ఉపసర్గలో ఎంతెంత భావాలు పొదగగలడో వ్యాసులవారు - గీత మనకు తెలియజేస్తుంది.

ధర్మం అన్న దానిని గూర్చి, దాని విశిష్టతను, ఆచరించి తీరవలసిన ఆవశ్యకతను గూర్చి పరోక్షంగానే ఎంత మనోహరంగా చెప్పారో చూడండి.

"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత,

అభ్యుత్థానమ ధర్మస్య, తదాత్మానామ్ సృజామ్యాహమ్॥"

కృష్ణుడంటున్నాడు - ఓయీ! అర్జునా! ప్రపంచంలో ధర్మానికి కీడు కలిగినప్పడు, అధర్మానికి అభివృద్ధి కలిగినప్పడు నన్ను నేను సృష్టించుకొంటున్నాను - అని ధర్మో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ధర్మాన్ని మనం పదిలంగా కాపాడుకోగలిగితే అది మనను భద్రంగా కాపాడుతుంది. అలాంటి ధర్మానికి హాని కలుగుతున్నపుడు స్వయంగా ధర్మస్వరూపుడైన పరమాత్ముడే రాక తప్పదు. అంటే అంతవరకు నిరాకార పరబ్రహ్మగా ఉన్న తాను, సాకారుడై, సగుణుడై కార్యాచరణకు దిగుతాడన్నమాట. ఇందులో ఇంకో చమత్కృతి కూడా ఉంది. మనం ఈ కలికాలంలో, ఈ 21వ శతాబ్దంలోనే అధర్మం ప్రబలిపోయిందని అనుకోనక్కరలేదు. "యదాయదా" అనడం వలన అప్పడప్పడు యీ ధర్మ హాని కలుగుతూనే ఉంటుందనీ, అప్పడప్పడంతా తాను వస్తూనే ఉంటాననీ స్వామి చెప్తున్నారు. అంతే గదా! బయట ఏదో గొడవవుతుంది. మన నాన్నగారే స్వయంగా అందులో నిలబడి ఉంటారు. అప్పడు ఇంట్లో మిగిలిన వాళ్లం ఏమీ పట్టించుకోకుండా ఉంటామా? అధర్మం పెరగడాన్ని తాను సహించనని, ధర్మరక్షణకై స్వయంగా భగవంతుడే

పూనుకున్నప్పుడు - మనం పట్టనట్లు ఊరుకోవచ్చునా? తగదు గాక తగదు. మనమూ రంగంలోకి దిగవలసిందే. లోకాతీతుడైన పరమాత్ముడే లోకరక్షణకై నడుం కడితే - లోకంలో ఉండి అధర్మం వలని కష్టనష్టాలను అనుభవిస్తున్న మనం చేతులు ముడుచుకొని కూర్చోవడం సబబా? సమాధానం ఆలోచించండి.

పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ।

- (అలాంటి సమయంలో) "సజ్జనులను రక్షించడానికి, దుర్జనుల వినాశనానికి, దాని ద్వారా ధర్మాన్ని సుస్థిరపరచడానికి నేను ప్రతి యుగంలో అవతరిస్తూ ఉంటాను". సత్ప్రవర్తన కలిగినవారు ఎదుటివారు ఎలాటి వారైనా తొందరగా శిక్షించలేరు. అంచేత వారిని రక్షించడానికి తాను దిగి వస్తాడు భగవానుడు. సత్ప్రవర్తనకు గీటు రాయి ధర్మాచరణమే. దానికి హాని కలిగితే కాపాడడం దైవం పనే. దుష్టులను అణిచివేసి, వీరిని రక్షిస్తాడు. నిజమే, కానీ ఎప్పుడు? మనిషి తన పని తాను చేసి కదా దైవం మీద ఆధారపడాలి! సజ్జనుడు అధర్మాన్ని ఎదిరించడానికి తనకున్న శక్తియుక్తులన్నీ ఉపయోగించాలి. ఇక అతని శక్తికి మించిపోయిందన్నప్పుడు వస్తాడు భగవంతుడు. అంచేత మొదట మన పని మనం చేయటమే దైవానుగ్రహం సంపాదించడానికి యోగ్యత, అర్హత. అటువంటి అర్హులైన వారిని ఏదో రక్షించటం కాదు - 'పరిత్రాణాయ' సమగ్రంగా రక్షించడానికి. 'వినాశాయ' దుష్టులను సర్వనాశనం చేయడానికి వస్తాడాయన. అప్పుడు ధర్మ 'సంస్థాపనం' జరుగుతుంది. అంటే సమ్యక్ స్థాపనం - సుస్థిరంగా నిలపటం జరుగుతుందట. ఇదీ వ్యాసుల వారి భావం. అందుకే ఆ మాటలలోని, పరి, సం- అంటూ ఉపసర్గలు వాడటం. అలా అని మనం ఎలా చెప్పగలమంటారా! ఇదే వ్యాసులవారు మరోచోట అన్న భావానికి నన్నయగారి ఆంధ్రానువాద పద్యం దీనికి ఋజువు. చదవండి.

సారపు ధర్మమున్ విమల సత్యము పాపము చేత, బొంకుచే
పారము బొందలేక చెడబారిన దైనయవస్థ దక్షులె
వ్వారలు పేక్షసేతురది వారల చేటగు గాక ధర్మని





స్తారకమయ్యు, సత్య శుభ దాయకమయ్యును దైవముండెడున్"

దైవం ఎప్పుడూ సత్యాన్ని, ధర్మాన్ని కాపాడుతాడు. కాని కొంతవరకైనా అలా కాపాడగల సమర్థత ఉండి కూడా ఎవరైతే ఆ పరిస్థితిని అడ్డుకోకుండా అశ్రద్ధతో ఊరుకుంటారో అది వారికే కీడు కలుగజేస్తుంది. అందుచేత ధర్మసంరక్షణలో మనకు కూడా భాగం ఉండి తీరుతుందనే అంటారు వ్యాసులవారు. విధర్మీయులు కొందరు "కరుణామయుడైన దేవుడు దుర్జనులనైనా క్షమించాలి గాని చంపడం తప్ప గదా" అంటారు. కానీ, నిజానికి ఆ శిక్ష వలన ఆ చెడుగులకు మేలే జరుగుతుంది. దాని వలన వారి పాపం పరిహారమవుతుంది. ఒక శరీరంలో కుళ్ళిపోయిన భాగాన్ని తొలగించకపోతే మిగిలిన అవయవాలన్నింటికీ ఆ కుళ్ళు పాకి మొత్తం శరీరమే నశించిపోతుంది. సమర్థుడైన శస్త్ర వైద్యుడు ఏ విధంగా ఆ దుష్టాంగాన్ని ఖండించి, శరీరాన్ని కాపాడుతాడో, భగవానుడు కూడా అలాగే దుష్ట సంహారం చేసి, సమాజాన్ని రక్షిస్తాడు. గీతా బోధ ఇదే! ధర్మ స్థాపనలో మీ వంతు పని మీరు చేయండి. భగవంతునికి బరువు తగ్గించండి. లేదా - అది మీకే చేటు.

## సాయివాణి చందాదారులందరికీ ఒక విన్నపం

సాయివాణికి ఆజీవ (లైఫ్) సభ్యులుగా, వార్షిక సభ్యులుగా ఉన్న వారందరికీ ఒక సూచన చేస్తున్నాం. మీరందరూ ఒక కార్డు మీద మీ చిరునామా, మీ సభ్యత్వ సంఖ్య, (మీకు అందే పుస్తకం రేపర్ మీద ఉంటుంది) వీటితోపాటు మీ ఫోన్ నంబర్లు (లేండ్ ఫోనైతే కోడ్ కూడా) వ్రాసి పంపండి. ఏవైనా మార్పులుంటే తెలుసుకోవడానికిగానీ, మీ అభిప్రాయాలు చర్చించడానికిగానీ యీ ఫోను నంబర్లు పనికి వస్తాయి. మీరు కేవలం సాయివాణి పాఠకులుగానే కాక - సాయిధామం బంధుబలగంగా మారాలని మా ఆకాంక్ష, స్వాగతం. మీ కార్డులు ఈ నెలలో తప్పక చేరేలా వ్రాయండి.

**- మీ ప్రధాన సంపాదకురాలు**

# జీవన సౌందర్యం

ప్రతి మనిషీ ఆనందంగా జీవించాలనే కోరుకుంటాడు. కానీ తానే స్వయంగా ఆనందాన్ని భగ్నం చేసుకొంటుంటాడు. మనం అంగీకరించలేని కఠిన సత్యమిది. సుఖం వేరు - ఆనందం వేరు. హాయికీ, ఆనందానికీ బంధుత్వం ఉన్నది గానీ సుఖానికీ, ఆనందానికీ అంతగా అనుబంధమేమీ లేదు. మనిషి తనకు కావలసిందేమిటో తానే తెలుసుకోలేని అయోమయ పరిస్థితులు దీనికొక కారణం. అవసరాలకూ, ఆడంబరాలకూ మధ్య సరైన గీత గీసుకోకపోవటం మరో కారణం. తన ఆనందాన్ని యితరుల ఆనందంతో పోల్చి చూచుకొనే దౌర్భాగ్యం చివరి కారణం.

మా వాడొకడు చక్కని చిన్న యింట్లో హాయిగా ఉండేవాడు. వాళ్ల ఆవిడకు ఆ యిల్లు సంతృప్తినివ్వలేదు. మంచి పెద్ద బిల్డింగ్ కావాలని పోరు పెట్టి లోన్లు పెట్టి మరీ పెద్ద యిల్లు కట్టించుకున్నది. ఉన్నది ముగ్గురు మనుషులు. ఎనిమిది గదుల యిల్లు. పని పెరిగింది. ఫర్నీచర్ ఖర్చు పెరిగింది. పని మనిషులు అవసరం వచ్చింది. లోన్‌ల బరువుతో జీవనావసరాల కుదింపు. ఉన్న ముగ్గురూ రెండు గదుల్లో నిద్రపోతే, రాత్రి టి.వి. రూములో ప్రొద్దు పోయేదాకా ఉంటే మిగతా గదులలో ఎవరు దూరతారో, ఏం జరుగుతుందోనన్న అభద్రతా భావం- మొత్తం మీద ఆవిడ తన ఆనందం చెవులు ఆడంబరం పేరుతో తానే పిండేసుకున్నది. ఒకరికి నలభై జతల బట్టలున్నాయనుకుందాం. ఒకసారి ఎన్ని కట్టుకోగలరు? రోజుకు ఎన్నిసార్లు మార్చుకున్నా గానీ ఒంటి మీద ఉండేది ఒక్క జతేగా! నగల విషయమూ అంతే. వజ్రాలు పొదిగిన గుండీలు చేయించు కున్నాడు మా బన్నీగాడు. "వీటి దుంప తెగ - యివేమైపోతాయోనని వీటి చుట్టే తిరుగుతున్నాయి ఆలోచనలు" అంటూ పీకి అమ్మి పారేసి చేతులు కడుక్కున్నాడు. 'హమ్మయ్యా' అనుకున్నాడు ఆ తరువాత. ఎన్ని బంగారు హారాలున్నా అన్నీ ఒకేసారి దిగేసుకొని అమ్మవారిలా తిరగలేరుగా! ఒకటో రెండో ఒంటి మీద ఉంటే మిగతావన్నీ బీరువాలోనో, బ్యాంక్ లాకర్‌లోనో. అక్కడుంటే





ఏం - దుకాణంలో ఉంటే ఏం? ఆపాటి దానికి వాటిని కొనుక్కోవాలన్న తపనతో ఆనందం భగ్నం చేసుకోవటం దేనికి?

ఇదంతా ఎందుకు వస్తుందంటే - యితరులతో మనని మనం పోల్చి చూచుకోవటం వలన, భగవంతుడు మనకు ఏది ఎంత వరకు అవసరమో అంతా యిస్తాడు - మనది కాని దాని కోసం పాకులాట అవివేకం అన్న అవగాహన లేకపోవటం చేత, మనకు అవసరం ఉన్నా లేకపోయినా లోకంలోకి వచ్చినవన్నీ మనకూ కావాలనే దుగ్ధ వలన, తృప్తిలోనే హాయి వుందని తెలుసుకోలేకపోవటం వలన.

మా లక్ష్మమ్మ 83 సం॥ వృక్తి. యౌవనంలోనే భర్త పోగా, యిద్దరు కొడుకులను నడుం కట్టుకొని కూలి చేసి మరీ పెంచింది. ఇప్పుడు అమెరికాకూ, ఇండియాకూ తిరుగుతోంది మనుమల దగ్గరకు. ఆమె అంటూంటుంది - "ఏదైనా తింటోంటే బావుందనీ, బాగో లేదనీ నాకు అనిపించదు. ఆనాడు కారం మెతుకులూ కమ్మగానే ఉండేవి. ఇప్పుడు పరమాన్నమూ రుచిగానే ఉంటుంది. రుచి నాలుక మీద ఉంటుంది గానీ పదార్థంలో కాదమ్మా" అని. ఎంత సత్యం! ఆనందం మనసులోంచీ వస్తుందిగానీ వస్తువులలో ఉండదు - అది నిజం.

ఏదో లేదనీ, ఆశించింది దొరకలేదనీ, ఉన్నది పోయిందనీ - ఏవేవో కారణాలతో ఆత్మహత్యలు చేసుకునే వాళ్లని చూస్తే నాకు బాధ కలగదు - చచ్చే కోపం వస్తుంది. ఎంత మూర్ఖత్వం! భగవంతుడిచ్చిన దారిబత్తెం ప్రాణం. మన గత జన్మల పాపపుణ్యాల ఫలితాలు అనుభవించేసి, ప్రారబ్ధం పోగొట్టుకోవడానికి దైవమిచ్చిన అద్భుతమైన జన్మ మానవజీవితం. ఈ మాత్రం తెలియదా యీ వెర్రివాళ్లకి!' అనిపిస్తుంది. 'పాపం, వాళ్లకెన్ని కష్టాలో!' అంటారా! కష్టాలన్నవి కలకాలం కాపురం చేయవనీ, చీకటి తరువాత వెలుతురు ఖచ్చితంగా వచ్చి తీరుతుందనీ తెలియదా? వారి జీవన ప్రేమ యింత అల్పమైనదా?' అనిపిస్తుంటుంది.

ఆనందం అనగానే ఏవో పెద్దపెద్దవే ఊహించుకోవటం మనకు అలవాటై పోయింది. మండుటెండలో నడిచి వచ్చాక నీడన కూర్చొని చల్లటి

మంచినీళ్లు త్రాగటం హాయినివ్వదూ! ఎముకలు కొరికే చలిలో సెగలు కక్కే కాఫీ కప్పు ఇచ్చే హాయి తక్కువదా! విరిసే పువ్వులూ, కురిసే వానజల్లుల మధ్య లోంచీ మెరిసే ఎండా, పురివిప్పిన నెమలీ, ప్రభాతవేళ వినిపించే పక్షుల కిలకిలా రావాలలోని సంగీతం, వాన ఆగిపోయాక చెట్ల కొసలపై మెరిసే సూర్యకిరణాలూ, పడమట హరివిల్లూ, మామిడి కొమ్మల్లో కోకిల కూతా-ఇవన్నీ ఆనందాన్నివ్వవూ? ప్రకృతీ, మనిషీ ఒక్కటే. మనిషి ప్రకృతిలోని భాగంగా ఉండటం మర్చిపోయి, తాను సృష్టించుకున్న యంత్రాల మధ్య యంత్రంగా బ్రతకటం కూడా జీవన సౌందర్యం కోల్పోవడానికి ఓ ముఖ్యకారణం. మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ దివ్యమోహన్ అంటారు - "ఎంతో చికాకుతో, వేదనతో, ఏకాకినన్న ఫీలింగ్‌తో ఉన్నపుడు ఓ చిన్నారి పాప అమాయకపు చిరునవ్వు చూడండి. ఆమె వచ్చీరానీ తొక్కు పలుకులు వినండి. ఒక్కసారి చెక్కిళ్లు నిమరండి. పోయిన మీ చైతన్యం తిరిగి వస్తుంది" అని. ఇది మనందరికీ అనుభవమే.

జీవనసౌందర్యం అంటున్నాం గదా! జీవనం సంగతి తర్వాత - అసలు సౌందర్యం అంటే ఏమిటి? తెల్లవారి లేచిన దగ్గర్నుండీ అర్ధరాత్రి నిద్రబోయే వరకు మనం నిత్యానుష్ఠానంతో ఆరాధించే టి.వి. దేవత మనకేం బోధిస్తుంది? జుట్టు పెంచుకోవటం ఒంటి రంగు వన్నె తేలేలాగా అదీ యిదీ పులుముకోవటం, మంచి బ్రాండ్ షాంపూలు, బ్లేళ్లు, బనియన్లు వగైరా వగైరాలు వాడటం - యింకా, యింకా, యింకా. నిజంగా సౌందర్యం శరీరానికి మాత్రమే సంబంధించిందా? గుణాలలో, ప్రవర్తనలో, మాటలో, మన్ననలో ఎక్కడా సౌందర్యానికి తావు లేదా? సమగ్రమైన కార్యదక్షతలో, సామాజిక స్పృహలో, కళలలో పరోపకారంలో ఎక్కడా సౌందర్యం ఉండదా! ఓ గావంచా గుడ్డ కట్టుకొని, ఉత్తరీయం కప్పుకున్న బోసి నోటి గాంధీజీ, ఒంటినిండా ముతకచీర చుట్టుకున్న శారదా మాత, గొగ్గిపళ్ల రామకృష్ణ పరమహంస, చినిగిన కఫినీ తొడిగి నెత్తికో గుడ్డ చుట్టుకొన్న ఫకీరు సాయిబాబా వీళ్లంతా మనకు అందంగానే అనిపిస్తున్నా రెందుకని? వారి వారి చర్యలు, లీలలు, గొప్పతనాల వలన. అంతదాకా ఎందుకు- కోతి ముఖం ఆంజనేయుడు సుందరంగా కన్పించడం ఏమిటి? ఆయన అకుంఠిత స్వామి భక్తే దానికి కారణం.



సాయి వాణి

మనకు రాష్ట్రపతిగా పనిచేసి, ఆ పదవికే ఒక వన్నె తెచ్చిన శ్రీ అబ్దుల్ కలాంను ఒకసారి ఇందిరాగాంధీ తనను కలవవలసిందిగా ఆహ్వానం పంపింది. అప్పడామె భారత ప్రధాని. ఈయన ఒక శాస్త్రవేత్త- అంతే. కానీ, క్షిపణులకు సంబంధించి ఆయన సాధించిన ఘనవిజయానికి అభినందన పూర్వకంగా ఆమె కబురుచేసింది. అప్పడు కలాం బాగా అలసిపోయి, పైగా నలిగిపోయిన మామూలు దుస్తులతో ఉన్నాడు. "ఇలా, యీ బట్టలతో వెళ్లనా ప్రధానమంత్రిని చూడటానికి!" అన్నాడాయన. ఆయన పై అధికారి ప్రొఫెసర్ ధావన్ (అని గుర్తు) "కలాం, మరేం ఫర్వాలేదు వెళ్లు - నీ విజయమే నీ సౌందర్యం" అన్నాడు. దీన్ని గ్రహించినవారు తమ గుణగణాలను, మంచితనాన్ని, సమర్థతను పెంచుకొనే ప్రయత్నం చేస్తారే తప్ప - తోలు తెల్లగా, జుట్టు నల్లగా, తనువు సొగసుగా ఉండటమే ధ్యేయంగా బ్రతకరు.

అప్పలతో వినోదాలను, విలాసాలను కొనుక్కొని, అదే ఆనందంగా భ్రమించి ఆ అప్పలు తీర్చటంలో కొట్టుకుపోతూ అసలైన జీవన సౌందర్యాన్ని పోగొట్టుకొనే వారూ లేకపోలేదు. కిటికీలో నుండీ ఇద్దరు వ్యక్తులు ఒకేసారి బయటకు చూచారు. ఒకరికి ఆకాశంలో చుక్కలు కన్పించాయి. మరొకరికి నేల మీది బురద కన్పించింది. అలాగే ఓ చక్కని గులాబీని చూచి మొదటివాడు "ఎంత గొప్పవాడు భగవంతుడు! ఇన్ని ముళ్ల మధ్య కూడా యింత చక్కని పూవు పూయించాడు!" అన్నాడు. రెండవవాడు "ఏం దేవుఁడురా బాబూ! ఇంత అందమైన పువ్వుకూ్కడా వెధవ ముళ్లు పెట్టాడు!" అన్నాడు. ఇద్దరూ బ్రతుకుతూనే ఉన్నారు. ఎటొచ్చీ మొదటివాడేమో ప్రతి దానిలో సౌందర్యాన్నీ, గొప్పతనాన్నీ చూస్తూ బ్రతుకుతున్నాడు. రెండవవాడు నిస్సారంగా, కేవలం దుఃఖాన్నీ, లోట్లనూ ఆరాధిస్తూ బ్రతికేస్తున్నాడు. సంతృప్తిని మించిన సంపద లేదు. అది సాధించిన వారికి జీవనసౌందర్యానికి లోటుండదు.

ఓ గురువుగారి దగ్గర చాలామంది విద్యార్థులు చదువుకున్నారు. అంతా పెద్దపెద్ద ఉద్యోగాలలో, వ్యాపారాలలో కుదురుకున్నారు. సంపాదనలతో, సంసారాలతో, పరుగుల బ్రతుకులతో అలసిపోయిన ఆ మిత్రులంతా కలిసి "రెండురోజులు గురువుగారి దగ్గర గడిపివద్దాం కాస్త ప్రశాంతంగా" అని

బయలుదేరి వచ్చారు. ఓ రోజంతా గడిచిపోయింది. పాత కబుర్లతో, కొత్త కబుర్లతో, నవ్వులతో, పరిహాసాలతో. గురువుగారు ఏకాకి - ఆయన స్వయంగా వీళ్లందరికీ వంట చేస్తోంటే - తమ స్టేటస్‌లు, ధనాలు, కీర్తిప్రతిష్ఠలు అన్నీ మరచిపోయి తలోపనీ అందుకున్నారు. చిన్నపిల్లల్లాగే యిల్లూడ్చారు. కూరగాయలు తరిగారు, ఆకులు కోసుకువచ్చారు. నీళ్లు తోడి తెచ్చారు. చాపలు పరిచి నీళ్లు పెట్టారు, వడ్డించారు, రోజంతా ఎంతో హాయి ఫీలయ్యారందరూ. రాత్రి చాపల మీద దొర్లుతూ కబుర్లు చెప్పకొంటూ నిద్రపోయారు. మరునాటి ఉదయం అందరూ కూడా ఎంతో తేటపడినట్లు కన్పించారు. ఫలాహారాలయ్యాక అందరూ ముందరి వరండాలో కూర్చున్నారు గురువుగారి చుట్టూ.

"నిన్నంతా ఎంతో ఆనందంగా గడిచింది. మళ్లీ సాయంత్రం నుంచీ బయలుదేరాలి - ఆ పళ్లచక్రాల మధ్యలోకి" అన్నారొకరు బయట ఆపి ఉన్న తమ పడవలంత కార్ల వైపు దిగులుగా చూస్తూ. ఇక అక్కడి నుంచీ సంభాషణ తమ తమ జీవితాలలోని చికాకులను గూర్చీ, తామనుభవిస్తున్న మానసిక ఒత్తిడులను గూర్చీ, సమాజంలోని తమ స్టేటస్ (స్థాయి) తమకు కలిగిస్తున్న గందరగోళాల గురించీ ........... అలా అలా సాగిపోయింది. మొత్తం మీద అందరూ ఎంతో (స్ట్రెస్) ఒత్తిడికి లోనవుతూ బ్రతుకుతున్నవారే. కాస్సేపయ్యాక వాళ్ల కబుర్లకు వాళ్లను వదిలి గురువుగారు లోపలికి వెళ్లారు. కాస్సేపటికి ఒక పాత్ర నిండా పొగలు కక్కే పాలు, మరో పళ్లెంలో కొన్ని గ్లాసులు తీసుకువచ్చి, వాళ్ల మధ్యలో ఉంచారు. వాళ్లనే పాలు పోసుకుని తాగమన్నారు. వాళ్లంతా తలో గ్లాసూ తీసుకున్నారు. గ్లాసులన్నీ ఒకే రకంగానూ లేవు, ఒకే సైజువీ కావు. కొన్ని గాజువి, కొన్ని కంచువి, కొన్ని ఇత్తడివి, కొన్ని కొత్తవి, కొన్ని పాతవి, ఒకటి రెండు వెండివీను. అందరూ తమతమ గ్లాసుల్లో పాలు నింపుకొన్నారు. అప్పడన్నారు గురువుగారు - "చూడండి బాబూ మీరిప్పడు చేతికి వచ్చిన గ్లాసు గభాల్న తీసుకున్నారా, ఏరుకున్నారా?" 'ఏరే తీసుకున్నాం' కొద్దిగా సిగ్గుపడుతూ అన్నారు శిష్యులు. "తీసుకున్న తరువాత కూడా మీలో ప్రతివారూ పక్కవారు ఎలాటి గ్లాసు తీసుకున్నారో గమనించారు కూడా!" చిరునవ్వుతో అన్నారు గురువుగారు. శిష్యులు అవునన్నట్లు తలలూపారు.





"చూడండి నాయనా! మీరు అనుభవిస్తున్న ఒత్తిడికీ, ఇరుకుకీ కారణం మీరే! మీరిప్పడు తాగవలసింది పాలని కానీ గ్లాసును కాదు. గ్లాసు ఏదైనా గానీ - లోపల పోసిన పాల రుచి మారదు. అది తెలిసి కూడా మీరు మంచిగ్లాసే ఏరుకోవాలనుకున్నారు. ప్రక్కవాళ్లకన్నా మెరుగైన గ్లాసు తీసుకున్నామా, లేదా అని అటూయిటూ చూచారు. మీ జీవితం పాలైతే- మీ స్టేటస్‌లు, కీర్తీ, ధనం అన్నీ కలిపి యీ గ్లాసు. మీరు పాల రుచిని గురించికాక ముందుగా గ్లాసు గురించి ఆలోచించినట్లే - మీ జీవనానందాన్ని గురించి కాక - సామాజిక స్థాయి గురించీ - అందునా యితరులతో పోల్చుకొని పోటీబడి మరీ పైపైకి పాకిపోవటం గురించీ ఆలోచిస్తున్నారు. అదే మీ ఒత్తిడికీ, ఆందోళనలకూ కారణం. ఉన్నతంగా ఆలోచించండి. సామాన్యులలా జీవించండి. ప్రకృతిని పలకరించండి. అంతేకాదు నాయనా! అసలైన జీవన సౌందర్యాన్ని అనుభవించ దలచుకొన్నవారు తమను గురించి కాక యితరుల గురించి ఆలోచించటం నేర్చుకోవాలి. మీ శక్తి మీకే పరిమితం చేసుకోకుండా పరుల సౌభాగ్యం గురించి కూడా శ్రమించండి. మీ వలన సహాయం పొందినవారు, మీ సేవలో కుదుట బడినవారు మీ వైపు చూచే ప్రేమమయమైన చూపు, వారి ఆర్ద్రమైన మాటలు మీ గుండెకు ఓ క్రొత్త జలదరింపునిస్తాయి. అలా యితరుల ఆనందానికి కారకులం కావటాన్ని మించిన జీవన సౌందర్యం మరేమీ ఉండదు. దానికోసం ప్రయత్నించండి" అన్నారు. గురువు మాటలు విన్న శిష్యులంతా తమ చేతులలోని గ్లాసులు క్రింద పెట్టి, చేతులు జోడించారు.

బ్రతకటం వేరు - బ్రతుకు బరువుగా మొయ్యటం వేరు - బ్రతుకు ఈడవటం వేరు - బ్రతుకునొక ఆనందలీలగా, సౌందర్యహేలగా మలుచుకోవటం వేరు. జీవనసౌందర్యానికి ఎనలేని భూషణం చిన్న చిరునవ్వు. ఎంతటి ఇబ్బందినైనా యిట్టే మాయం చేయగలదీ, యీ విశాలసృష్టిలో మరి ఏ యితర జీవికీ యివ్వకుండా నీ కోసమే విశ్వవిధాత యిచ్చిందీ 'నవ్వు'. ఆ నవ్వే ఒక తిరుగులేని ఆయుధంగా ముందుకు నడుద్దాం. అంచేత, మిత్రులారా, మనం సహజంగా జీవించే ప్రయత్నం చేద్దాం. కాస్త ఆకాశంవైపు, నేలవైపు, చెట్ల వైపు, చిట్టి పిట్టల వైపు, పూల కన్నెల వైపు చూద్దాం. ఇతరుల గుండెలోతుల్లోని భావాలను గ్రహించే ప్రయత్నం చేద్దాం. కలిసి హాయిగా నవ్వటం, కన్నీళ్లు చిరునవ్వులు కలబోసుకుంటూ కూడా ఆత్మల అందాలు చచ్చిపోకుండా బ్రతుకుదాం.

# ఆదిగురువు-దత్తప్రభువు

(గత సంచిక తరువాయి)

పక్వమైన పండే నేలరాలుతుంది. పాపపుణ్యాలు కూడా అంతే పక్వమైనప్పడే ఫలితం అనుభవానికి వస్తుంది. ఒకనాడు జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు కార్తవీర్యుడు. ఆ ఋషి ఆశ్రమ సంప్రదాయం ప్రకారం ప్రభువును సత్కరించాడు. కుశలప్రశ్నాదికాల తరువాత "మహారాజా, ఈ పూట మా ఆతిథ్యం స్వీకరించండి" అని చెప్పి తనచెంత ఉన్న కామధేను సంతతికి చెందిన "సురభి" అన్న గోమాతను పిలిచి, "అమ్మా రాజుగారు విచ్చేసారు. వారి బలగం అంతటికీ మంచి విందు భోజనం ఏర్పాటు చేయి తల్లీ!" అన్నాడు. వెంటనే గోమాత రకరకాల భక్ష్యాలు, భోజ్యాలు, చోష్యాలు, లేహ్యాలతో కూడిన షడ్రసోపేత భోజనం సృష్టించి కడుపార పెట్టించింది అతిథులకు. కార్తవీర్యుడు సప్తద్వీపాలకూ చక్రవర్తి. దత్త కృప వలన అతనికి లేనిది లేదు. కాని అతనికి సురభి కావాలనిపించింది. "అది గోరత్నం. రాజ్యంలోని రత్నమాణిక్యాలకూ, సర్వశ్రేష్ఠమైన వాటికీ రాజే అధిపతి. దీన్ని పొందే హక్కు నాకున్నది" అనుకొన్నాడు. అయినా కొంత మర్యాద పాటించడానికి "స్వామీ, నాకా గోమాతను ఇవ్వండి. మీరన్న దానికి వందరెట్లు ధనమిస్తాను. లేదంటే వెయ్యి ఆవులిస్తాను" అన్నాడు. తనకు దానిని ఉపయోగించుకొనే హక్కే గానీ అమ్ముకొనే హక్కు లేదనీ, బ్రాహ్మణసొత్తు రాజులు కోరరాదనీ హితవు చెప్పాడు జమదగ్ని. పోగాలం దాపురించినపుడు హితవాక్యం రుచించదు గదా! అంచేత మండిపడిన కార్తవీర్యుడు సురభిని బలవంతంగా లాక్కుపోయాడు. అతని సైనికులు విజయోన్మత్తతతో ఆశ్రమం అంతా అతలాకుతలం చేసారు.

ఆ సమయంలో ఇంటలేక తరువాత వచ్చిన జమదగ్ని జ్యేష్ఠపుత్రుడు పరశురాముడు జరిగినది విని భగ్గుమన్నాడు. చిన్నవోయి కూర్చున్న జమదగ్ని ముఖమే కళ్లలో మెదలుతోంది అతనికి. తన ఆయుధం చేతబట్టి బయలుదేరాడు. కార్తవీర్యుని రాజధాని చేరుకున్నాడు. ఉరమని పిడుగులాగా తన సైన్యం మీద విరుచుకుపడిన పరశురాముని చూచి తెల్లబోయాడు కార్తవీర్యుడు. రూపురేఖలు బ్రాహ్మణునివి. తేజం, శౌర్యం క్షత్రియునివి. ఎవరితడు? ఆయనకు వసిష్ఠ మహర్షి శాపం గుర్తు వచ్చింది. రెండు క్షణాల పాటు అమనస్కుడైనాడు. తేరుకొని నిశ్చలంగా నిలిచాడు. తాను దత్తాత్రేయస్వామిని ప్రార్థించాడు ఒకప్పడు





"నా కంటే గొప్పవాని చేతిలో నాకు చావు రావాల"ని. స్వామి తనకు ధనధాన్యాలిచ్చాడు. వేయి చేతులిచ్చాడు. అంతులేని విజయాలిచ్చాడు. ఆయన ఇవ్వనిదీ తాను ఆర్జించుకొన్నదీ ఒకటే. అది అహంకారం. దానివలననే తన బుద్ధి వక్రించింది. సాధునింద, పరవస్తుకాంక్ష, పొగరుమోతుతనం వీటన్నిటికీ మూలం తన గర్వమే. అయినా స్వామి కరుణ తనను వీడలేదు. తానడిగిన చివరి వరం కూడా తీరుస్తున్నారు. తనకంటే శ్రేష్ఠుడైన వీరుడు - తనకన్న తేజస్వి- తనకన్న ఉత్తమ కులజుడైన వాని చేతిలో తన మరణం సిద్ధించేలా చేస్తున్నాడు. అయినా తాను క్షత్రియుడు. ఓ మంచివీరునితో తలపడే అవకాశం దొరికినపుడు వదులుకోకూడదు. కార్తవీర్యుడు మహోత్సాహంతో పరశురాముని ఎదుర్కొన్నాడు. కొంత యుద్ధం తరువాత అతని గండ్రగొడ్డలి దెబ్బలకు ఆహుతి అయి నేలకు ఒరిగాడు.

కార్తవీర్యుని జీవితం శిష్యులందరికీ పాఠ్యాంశంగా బోధింపబడాలి. అతనికి గురుభక్తి ఉంది. ధృఢసంకల్పంతో గురుసేవ చెయ్యగల శక్తి ఉంది. గురువు అనుగ్రహమూ ఉంది. జిజ్ఞాసా, మోక్షేచ్ఛా ఉన్నాయి. ఇవన్నీ ఉన్నప్పటికీ అతడు అహంభావాన్ని వదులుకోలేకపోయాడు. సంస్కారాలు ఒకరు అద్దితే నిలిచేవి కావు. లోపలినుండీ పుట్టాలి. జన్మతః రావాలి లేదా మనిషి తనంతతానుగా ఆలోచించుకొని సాధన చేసి మంచి సంస్కారవంతుడు కావాలి. రెండూ లేకపోతే ఎంత మంచి గురువు ఉన్నా, ఆయన ఎంతగా కృప చూపినా ఇతనికి ప్రయోజనం ఉండదు. కార్తవీర్యుడు పూర్వం సుదర్శన చక్రమనీ, 'నేను సాయం చేయకపోతే ఈ విష్ణువు దుష్టులను అణచగలిగేవాడా!' అని అహంకరించిందనీ, అందుచేతనే శాపగ్రస్తమై ఇలా మానవలోకంలో పుట్టిందనీ ఒక ఐతిహ్యం. లిమ్మనీ, శౌర్యమిమ్మనీ, విజయాలిమ్మనీ అడిగాడేగానీ -సుజ్ఞానమిమ్మని అడగ లేదు. అయినా దత్తుడు దయామయుడు. అతని చివరి కోరిక కూడా తీర్చాడు.

మనం నేర్చుకోవలసింది ఒక్కటే. గురువు ఎంత మహనీయుడైనా, మనకెంత గురుభక్తి ఉన్నా - ధర్మం తప్పి చరించినపుడు మననెవ్వరూ రక్షించలేరు. స్వయంగా దేవు(డైనా సరే మన ప్రారబ్ధం-అంటే మన కర్మఫలాన్ని రద్దుచేయునపుడు గురువు మాత్రం ఎలా చేస్తారు? అంచేత అహం, ధర్మవిరుద్ధ వర్తనం ఇవి మన ముక్తికి గొప్ప ఆటంకాలు. కార్తవీర్యుని కథ మనకు చెప్తుంది. దత్తాత్రేయుని భక్తి వాత్సల్యానికి అయినాగానీ ఆయనను వెన్నంటి వచ్చే ధర్మ దేవతల పట్ల అలక్ష్యాన్ని సహించని దివ్యత్వానికీ కూడా ఈ కథ సంకేతం.

(సశేషం)

# మాతృసంస్థ కబుర్లు

ఆగస్టు 16వ తేదీ ఉదయం గురుదేవులు సత్యనారాయణ కాలనీలోని శ్రీ సాయిబాబా సత్యనారాయణస్వామి వార్ల దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న భక్త సమావేశంలో ప్రవచనం చేయడానికి విచ్చేసారు. భక్తి గురించీ, ఆలయాల నిర్వహణ గురించీ, శ్రీ సాయినాథుల శక్తిని గురించీ వారు తమదైన శైలిలో ప్రవచించారు. అదేరోజు సాయంత్రం నేరేడుమెట్టలోని విశ్వ హిందూ పరిషత్తు తరఫున ఏర్పడిన హనుమచ్ఛక్తి జాగరణ సమితి వారు ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా పారాయణ సమావేశంలో ముఖ్యఅతిథిగా వేంచేసారు. హనుమంతుడి విశిష్టతను గురించీ, ఆయన శక్తి భక్తియుక్తులను నేటి యువత ఆవహింపజేసుకోవలసిన ఆవశ్యకతను గూర్చీ, అయోధ్యలో రామాలయం ఉండి తీరవలసిన ఆవశ్యకతను గూర్చీ వివరంగా బోధించారు.

ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా శ్రీ సాయి విద్యాధామంలో పతాకవందనం, తదుపరి పిల్లలతో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. "శిరసెత్తు గగనమ్ముదాకా" అని జెండాను ఉత్సాహపరుస్తూ - "ఇక్కడేదో పండగంట- ఆనందాల సందడంట రండీ, రండీ, రారండీ!" అని అందరినీ ఆహ్వానిస్తూ, భారతీయుల గొప్పదనాన్ని వివరిస్తూ- "వియ్ ఆర్ చిల్డ్రన్ వియ్ ఆర్ ఇండియన్స్" అని ధాటిగా ప్రకటిస్తూ - ఇంకా ఎన్నెన్నోరీతుల పాటలు, పద్యాలతో అలరించారు. 'పండితుని గర్వభంగం' 'శత్రువు మిత్రుడు లాటి చిన్ని నాటికలలోను, కోలాటంలోను పిల్లలు ఎంతో చక్కగా నటించారు. గురుదేవుల దివ్యాశీస్సులు పిల్లలందరికీ అందాయి. అన్నింటికీ మించి యీ సంవత్సరం పతాకావిష్కరణ బడిలో అందరికన్నా చిన్నపిల్లైన చి॥ కనకదుర్గ అనే ఎల్.కె.జి. విద్యార్థినితో చేయించారు. చాలా ఎక్కువకాలం స్వాతంత్ర్యఫలం అనుభవించ వలసినదీ, అనుభవించగలిగినదీ వాళ్లే - పిల్లలే గదా మరి!

ఆగస్టు 20వ తేదీ శ్రావణంలోని రెండవ శుక్రవారం గనుక వరలక్ష్మీవ్రతం ఏర్పాటైంది సాయిధామంలో. వర్షం గదా- అనుకొన్నాంగానీ ప్రతి సంవత్సరం లాగానే ముత్తయిదవలు పూజాసామాగ్రితోసహా విచ్చేసారు. ఐదు పదుల మంది పూజ చేస్తుండగా రెండు వందలమంది కళ్లారా వీక్షించారు. చి॥ గీత, దివ్యలు అలంకరించిన అమ్మవారు ఆనందంతో ఆశీస్సులివ్వగా, గురుదేవుల దీవెనలందుకొని, ప్రసాదస్వీకారంతో భక్తులంతా తరలివెళ్లారు.

27వ తేది సాయిధామ ప్రాంగణంలో ఆశ్రమం తరఫున వివాహక్రతువు నిర్వహించబడింది. పదహారేళ్ల క్రితం దివ్య అనే బాలిక ఆశ్రమ పెంపకంలోకి వచ్చింది. 'సాయిదివ్య' అనే పేరుతో పెంచి పెద్దచేసి ఎం.ఏ, బి.ఇడి. చదివించింది ఆశ్రమం. ఆమె చదువు పూర్తి అయిపోయింది. 27న ఆమె వివాహం. ఉదయం ఆరుగంటలకు నూనె, పసుపు నలుగులతో అభ్యంగన స్నానం చేయించి పెండ్లికూతురును చేసారు. గౌరీపూజ చేయించాడు సుబ్రహ్మణ్యం (పూజారి) పూజానంతరం వధువు అలంకరణ సాగుతుండగానే నగరం నుండీ మిత్రులు, సాయిధామం అభిమానులు రాసాగారు. కోలాహలం మొదలైంది. వరుని పక్షం వారు మెదక్ జిల్లా నుండీ రావాలి. రావలసిన వేళ మీరిపోయింది. ఇక్కడి గ్రామాలలో ముహూర్తం గురించిన పట్టింపు తక్కువ - అంచేత సమయానికవు తుందా అని కొద్దిగా ఆందోళన - పదకొండయింది-వరుడు వచ్చాడు. తిన్నగా వేదికపైకే తీసుకువెళ్లారు పురోహితులు. గణపతి పూజ ........ స్వయంగా సాయినాథుల వారే ఆశీర్వదించి పంపగా కన్య రావటం ................ తదితర కార్యక్రమాలు........... మధుపర్క దానం .......... పెద్ద ముత్తైదువలు దంచి యిచ్చిన జీలకర్ర, బెల్లం వధూవరుల తలలపై సమంత్రకంగా ఉంచారు. ఈ లోపల తెర పట్టడానికి నిలబడిన శీనుగాడు 'ఇంకెంతసేపు' అంటూ గోల. (వాడి బొజ్జ మీద నుండీ నిక్కరు జారిపోతూండటం- ఓ చేత్తో తెరనూ, మరోచేత్తో నిక్కరునూ పట్టుకోవలసి రావటం వాడి సమస్య)...

అలాఅలా మాంగల్యధారణ సశాస్త్రీయంగా జరిగిపోయింది. తలంబ్రాల వేడుకా జరిగింది. తదుపరి అగ్నిసాక్షిగా ఏడడుగులు-సప్తపది వేసారు వధూవరులు. అటుపై గురుజనులకు నమస్కారాలు. మధ్యలోనే భువనగిరి

నుండి రిజిస్ట్రారు ఆఫీసు వారు (మా ధర్మారెడ్డి గూడెం చంద్రారెడ్డిగారి కుమార్తె పద్మజ అక్కడే తహశీల్దారుగా ఉండటం చేత ఆమె వెంటబెట్టుకురావటం జరిగింది) వచ్చేసారు. రెండు వందల మంది (కంటి) దృశ్య సాక్షులుగా ఐదారుగురు సంతక సాక్షులుగా - వధూవరులు సంతకాలు చేసారు వారి సమక్షంలో. శాస్త్రీయ కళ్యాణానికి చట్టబద్ధత ఏర్పడింది దానితో. వివాహక్రతువు పూర్తయిన తరువాత విందుకు తరలివెళ్లారు బంధుమిత్రులు. వధూవరులు గౌరీపూజ జరిగినచోటికి వచ్చి ఆ దీపదర్శనం చేసి, తీపినీ, పెరుగన్నాన్నీ పంచుకొని తిన్నారు.

భోజనాలూ, సర్దడాలూ అయ్యేటప్పటికి దాదాపు రెండున్నర దాటింది. మూడుంబావుకంతా అప్పగింతలు పెట్టారు. అప్పగిస్తూ మాతాజీ "మా పిల్లకు పుట్టినిల్లు లేదని చులకన చేయకండి. ఆశ్రమంలో పెరిగింది గనుక లౌకిక ధర్మాలు తెలియక ఏదైనా పొరపాట్లు చేసినా కడుపులో దాచుకొని కాపాడు కోండి" అంటూనే కరిగి కన్నీరయ్యారు. అది చూచి ముందు వరుని వైపు వారే కన్నీళ్లు పెట్టుకొన్నారు. శ్రావణశుక్రవారం గనుక గడపకు దక్షిణ పెట్టి మరీ దాటించుకొని తీసుకుని వెళ్లారు వధూవరులను. వాళ్లు ప్రయాణమై వెళ్లిపోయే వేళ చిన్నతల్లులు సుధీరా, చైత్రా గోలగోలగా ఏడవసాగారు. "అక్కా, ఎందుకెళ్లి పోతున్నావ్? నీ జట్టు కచ్చి" అంటూ సుధీర లోపలికి పరుగెత్తుకు వచ్చి, మోకాళ్ల మీద తలపెట్టుకూర్చొని ఏడవసాగింది. మొత్తం మీద వివాహం నిర్విఘ్నంగా జరిగింది. దీనికి వచ్చి ఆశీర్వదించిన వారికీ, ఆశీస్సులు పంపిన వారికీ అందరికీ కృతజ్ఞతలు.

ముఖ్యంగా వరుని బంధువులు చూపించిన సంస్కారం, సౌమనస్యం, ఆశ్రమాన్ని గౌరవించిన తీరు ఎంతో ప్రశంసనీయంగా ఉన్నాయి. మా మంజుల వంటలను (కవితక్క సాయంతో) వాళ్లంతా ఎంతో మెచ్చుకొని, ఆప్యాయంగా తిన్నారు. చక్కగా, మర్యాదగా ప్రవర్తించి మాకు ఆనందాన్నిచ్చారు. గురుదేవుల ఆశీస్సులు పొందారు. మరునాడు ఆనందంగారు, చంద్రారెడ్డి, లక్ష్మణరావుగారు, రామకోటేశ్వర్రావులు వరుని యింట వ్రతానికి వెళ్లి ఆతిథ్యం పొంది, ఆశీస్సులిచ్చి వచ్చారు.





# మంగళాశీస్సులు

ఆశ్రమాభిమానులు, చిరకాల మిత్రులు, భక్తులు శ్రీ రేసు సత్యనారాయణ రెడ్డి (తార్నాక, హైదరాబాద్)గారు తమ మనుమడు చి॥ సాయిమాధవరెడ్డి వివాహం చి॥సౌ॥ లావణ్యతో 29-8-2010 ఉదయం హకీంపేట తూముకుంటలో సశాస్త్రీయంగా నిర్వహించారు. వధూవరులను ఆయురారోగ్య పుత్రపౌత్రాభివృద్ధిగా గురుదేవులు ఆశీర్వదించారు.

శ్రీమతి కేతుముక్కల వరలక్ష్మి, శ్రీ కె.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు దంపతులు ఆశ్రమాభిమానులు మాతాజీకి బాగా పాత పరిచితులు. వీరు తమ జ్యేష్ఠపుత్రుడు చి॥ సతీష్‌కు, చి॥ల॥సౌ॥ భారతితో 29వ తేదీ రాత్రి గం.11.45 ని.లకు ఎల్.బి. నగర్‌లోని గోటేటి కళ్యాణమంటపంలో వైభవంగా కళ్యాణం నిర్వహించారు. నవదంపతులు కలకాలం అన్యోన్యతతో జీవించి, సత్పౌరులను కని, దేశ కళ్యాణ పరులుగా వర్ధిల్లాలని గురుదేవుల ఆశీస్సులు.

శ్రీమతి మామిడన్న సౌందర్య స్వప్న, శ్రీ వేంకట రాజా కళ్యాణచంద్రలు చిరకాలంగా ఆశ్రమానికి అభిమానులు. కళ్యాణచంద్ర తల్లిగారు కూడా మంచి సాయిభక్తులు. అతను తన తమ్ముడు చి॥ వీర శశికుమార్‌కు విశాఖపట్నానికి చెందిన చి॥సౌ॥ జ్యోతిభవానిని ఇచ్చి 28-8-10 ఉదయం గం.7-30 ని.కు వైభవంగా వివాహక్రతువు ఆచరించారు. నవవధూవరులు కలకాలం అన్యోన్యంగా జీవించి, సత్సంతానవంతులై, దేశాభివృద్ధికీ, మానవకళ్యాణానికీ ఉపకరిస్తూ వర్ధిల్లాలని పూజ్యగురుదేవుల ఆశీర్వచనం.

శ్రీ వి.వి. పూర్ణచంద్రరావుగారు ఉక్కునగరం విశాఖపట్టణంలోనూ, ఆ పరిసర గ్రామాలలోను, ముఖ్యంగా గిరిజన క్షేత్రాలలోను సాయిభక్తి ప్రచారం చేస్తూ, పేద సాదలకు సహాయ సహకారాలందిస్తూ, గణనీయమైన సేవ చేస్తున్నారు. వారు, శ్రీమతి శ్రీశైల లక్ష్మీభ్రమరాంబగారు తమ జ్యేష్ఠ కుమార్తె చి॥ల॥సౌ॥ సాయి శిరీషను చి॥ యర్రమల్లి సాయికుమార్‌కు ఇచ్చి సెప్టెంబర్ 2వ తేదీ రాత్రి గం.3.08 ని.లకు విశాఖపట్నంలో వైభవంగా వివాహం చేశారు. వధూవరులు సాయినామాంకితులు. నిర్వాహకులు సాయిసేవకులు. వివాహం జరిగింది గురువారం. ఇక చెప్పేదేముంది! ఈ నవదంపతులు పరస్పరం అన్యోన్యంగా కలకాలం జీవిస్తూ, తమ సంతతిని లోకోపకారకులైన సత్పౌరులుగా పెంచుతూ, శ్రీ సాయి నిర్దేశించిన మార్గాన లబ్ధ ప్రతిష్ఠులు కావాలని పరమపూజ్య గురుదేవుల ప్రేమాశీస్సులు.